
సాక్షి
కాకినాడ
శనివారం । 25 । నవంబర్ । 2023



28 నుంచి సమ్మేటివ్-1

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసేందుకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ) పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) తాజాగా ప్రకటించింది.

10లో



జలవిహారం.. జగదానందకరం

క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినం సందర్భంగా అన్నవరం దివ్యక్షేత్రంలో.. పంపా సరోవరంలో.. సత్యదేవుని హంస వాహన విహారం పరమానందకరంగా జరిగింది.

10లో

డెల్టాలకు 6 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శుక్రవారం 6 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

27న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 27న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు శుక్రవారం క ప్రకటనలో తెలిపారు. డెస్టినీ సీఎస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జీఐఎస్ ఇంజినీర్, ఫ్లూయిన్ టు కంపెనీలో బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్, నయన గ్రూప్‌లో సిస్టం ఆపరేటర్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ ప్రొడక్షన్, సియాన్ హెచ్‌డబ్ల్యూఏ సమిత్, డిక్సాన్ అండ్ ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణ సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయంలో సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావచ్చన్నారు.

29న వైద్య ఆరోగ్య పోస్టుల భర్తీ

కాకినాడ క్రైం: నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఈ ఏడాది జూలై 1వ తేదీన ఇచ్చిన ఉద్యోగాల నోటిఫికేషన్‌కు సంబంధించిన ఒక ప్రకటన శుక్రవారం విడుదల అయింది. మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సులు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్, అకౌంట్ స్టాఫ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సపోర్టింగ్ స్టాఫ్ ఉద్యోగార్థులలో ఎంపికైన అర్హుల జాబితాను ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ తెలిపారు. జాబితాను ఈస్ట్‌గోదావరి.ఎపి.జీవోవీ.ఇన్, కాకినాడ.ఏపి.జీవోవీ.ఇన్, కోనసీమ.ఏపి.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లలో పొందవచ్చన్నారు. ఈ నెల 29వ తేదీన సాయంత్రం 5 గంటలలోపు అభ్యర్థులు కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చి అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ పొందాలని సూచించారు.

30న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈనెల 30న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నాయి. జెడ్పీ మీటింగ్ హాలులో వీటిని నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రులు, ఎంపీలు, శాసనమండలి, శాసనసభ సభ్యులు, జెడ్పీటీసీలు, ఇతర ఆహ్వానితులు హాజరయ్యే ఈ సమావేశాల్లో జిల్లాలో వివిధ ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు ప్రగతిని సమీక్షిస్తారన్నారు. జిల్లా అధికారులు శాఖాపరమైన సమగ్ర సమాచారంతో తప్పక హాజరు కావాలని సీఈవో కోరారు.

యాంటీబయోటిక్స్ అధికమైతే ప్రమాదమే

రాజమహేంద్రవరం రూరల్: యాంటీ బయెటిక్స్ అధిక మోతాదులో వాడితే ఆరోగ్యానికి ప్రమాదమని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి (డీఎం అండ్‌హెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం బొమ్మూరులోని కార్యాలయం సిబ్బంది, డీఎంఅండ్‌హెచ్‌ఓ నీలి రంగు దుస్తులు ధరించారు. యాంటీబయోటిక్స్ మందులను అవసరం మేరకు మాత్రమే వాడాలని నినాదాలు చేశారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యాంటీ మైక్రోబియనల్ వారోత్సవాల సందర్భంగా ఈనెల 18 నుంచి శుక్రవారం వరకూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలలో అవగాహన కల్పించామన్నారు. గ్రామాల్లోని ఆర్ఎంపీల వద్ద చికిత్స చేయించుకుని, రెండు, మూడు రకాల యాంటీబయోటిక్స్ వాడుతున్నందున భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు టి.రాజీవ్, అభిషేక్, సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఎపిడమలజిస్ట్ సుధీర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ జైలులో పనిచేసేందుకు మహిళా ఖైదీల ఎంపిక

కంబాలచెరువు: రాష్ట్రంలోనే తొలిసారిగా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోని ఓపెన్ జైలులో పనిచేసేందుకు శుక్రవారం సత్ప్రవర్తన కలిగిన మహిళా ఖైదీలను ఎంపిక చేశారు. జైళ్ల శాఖాధికారి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు మంగళగిరి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ డాక్టర్ ఐ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఓపెన్ జైలులో పని చేసే సమయంలో నడవడిక ఎలా ఉండాలో వారికి వివరించారు. 65 మంది మహిళా ఖైదీలలో 27 మందిని కోస్తాంధ్ర జైళ్లశాఖ డీఐజీ ఎంఆర్ రవికిరణ్ ఎంపిక చేశారు. వీరందరూ పాక్షిక ఆరు బయట జైలులోనూ, వ్యవసాయం, నర్సరీ, డెయిరీ, పెట్రోలు బంక్‌లలో పనిచేయనున్నారు. ఆరు బయట జైలులో పనిచేసే ఖైదీలకు ఎక్కువగా వేతనాలు వస్తాయని, తద్వారా వారు విడుదలైన రోజు ఆర్థికంగా ఆసరాగా ఉంటుందని మహిళా జైలు సూపరింటెండెంట్ సీహెచ్.వసంతకుమారి తెలిపారు.

సాధికారత సాకారం



తుని రాజా కళాశాల మైదానంలో సభ ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రి రాజా, ఎస్పీ సతీష్‌కుమార్



సభ ప్రాంగణంలోని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

- నేడు తుని రాజా కళాశాల మైదానంలో సామాజిక సాధికార బస్సుయాత్ర సభ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి రాజా
- తరలి రానున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించనున్న శ్రేణులు

తుని: బడుగు బలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేసిన చరిత్ర టీడీపీది. ఇందుకు భిన్నంగా బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలను అక్కున చేర్చుకుని బాసటగా నిలిచిన చరిత్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది. ఆయన అధికారంలోకి రాక మునుపు..వచ్చాక ఆయా వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారు. మంత్రి పదవులు, నామినేటెడ్, స్థానిక సంస్థలు వరకు బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించి అగ్రాసనం వేశారు.

ఈ నేపథ్యంలోనే జగన్ సారథ్యంలో ఈ వర్గాలకు చేకూరిన సామాజిక న్యాయం వివరించేందుకు వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా బస్సు యాత్ర కాకినాడ జిల్లా తునిలో శనివారం సాయంత్రం జరగనుంది. ఇందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. సభకు పెద్ద ఎత్తున బీసీ, ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలు తరలిరావడానికి సన్నద్ధమవుతున్నారు.

పార్కింగ్ ప్రదేశాలు

- తుని రూరల్ మండలం నుంచి వచ్చే వాహనాలకు శ్రీచైతన్య, నారాయణస్కూల్, గణపతినగర్‌లో పార్కింగ్‌కు కేటాయించారు.
- తొండంగి మండలం నుంచి వచ్చే వాహనాలకు తుని వ్యవసాయ మార్కెట్ యార్డులో, కోటనందూరు మండలం నుంచి వచ్చే వారికి రాజా కళాశాల మైదానం సూరవరం రోడ్డు, పార్కు రోడ్డు కేటాయించారు.
- తుని పట్టణానికి చెందిన వారు ఆయా ప్రాంతాలో పార్కింగ్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.



తుని ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన స్వాగతం ద్వారం

తునికి తరలి రాన్ను అగ్రనేతలు

బహిరంగ సభకు బీసీ,ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వైఎస్సార్ సీపీ అగ్రనాయకులు రానున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగర్జున, రెవెన్యూ, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎంపీలు నందిగం సురేష్, వంగా గీత,పిల్లి సుభాష్ చంద్రబోస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్సీలు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. సభకు ముందు మోటారు సైకిళ్లతో ర్యాలీ నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి రాజా

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అణగారిన వర్గాలకు నిజమైన సామాజిక సాధికారతను అమలు చేసి చూపించారు. రాజకీయ, ఆర్థికంగా బీసీ,ఎస్సీ వర్గాలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లారు. మాట నిలబెట్టుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆయా వర్గాలు అందుకే బ్రహ్మరథం పడుతున్నాయి. తుని రాజా కళాశాల మైదానంలో నిర్వహించనున్న సామాజిక సాధికార బహిరంగ సభ స్థలాన్ని రాష్ట్ర, రోడ్లు,భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, డిఎస్పీ లతాకుమారిలు శుక్రవారం పరిశీలించారు. సభకు 60 వేల మంది వస్తారని, ఇందుకు అనుగణంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని మంత్రి రాజా సూచించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు.

ఎల్లో మీడియా అసత్య ప్రచారం



రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు వస్తున్న స్పందన చూసి దుష్టచతుష్టయం, ఎల్లో మీడియా తట్టుకోలేక పోతున్నాయి. సభ ప్రారంభానికి ముందు, ముగిశాక ఖాళీ కుర్చీల ఫోటోలతో అసత్యాలను ప్రచురిస్తున్నాయి. తుని సభకు 60 వేల మంది హాజరు కానున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీలకు పదవులిచ్చి సామాజిక న్యాయం చేశారు. టీడీపీ, జనసేన పార్టీలు నామ్‌కే వాస్తే. మళ్లీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది.

–దాడిశెట్టి రాజా, ఆర్అండ్‌బీ మంత్రి

వికసిత భారత్ సంకల్పయాత్రకు శ్రీకారం



లబ్ధిదారులకు గ్యాస్ స్టౌలు అందజేస్తున్న ఉమా నండూరి, సర్పంచ్ సత్యనారాయణ

కాకినాడ రూరల్: కేంద్ర ప్రభుత్వ పథకాల ఫలాలను అర్హుల ఇంటి వద్దకు తీసుకువచ్చేందుకు వికసిత భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్టు ఈ కార్యక్రమం పర్యవేక్షకురాలు, కేంద్ర సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ ఉమా నండూరి పేర్కొన్నారు. జిల్లాలో తొలిసారిగా కాకినాడ రూరల్ తిమ్మాపురం గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించే స్టాల్స్‌ను ఆమె ప్రారంభించారు. చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులకు క్విజ్ పోటీలు, నానో డీఏపీ వినియోగంపై డోన్ ద్వారా డిమోన్‌స్ట్రేషన్ తదితర అంశాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బెజవాడ వీర వెంకట సత్యనారాయణ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన గ్రామస్తుల వివరాలను డీఎల్‌డీఓ నారాయణమూర్తి వెల్లడించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. ఉమా నండూరి మాట్లాడుతూ గ్రామ ఉన్నతికి సర్పంచ్ చాలా ఏళ్లుగా సేలదించడం స్ఫూర్తిదాయకమన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వివిధ పథకాలు పొందని వారిని గుర్తించి వర్తించేలా చూడటం వికసిత భారత్ సంకల్పయాత్ర ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం అనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరిస్తున్నారన్నారు. అనంతరం కేంద్ర ప్రభు త్వ పథకాలు ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఉజ్వల భారత్ స్కీమ్ కింద గ్యాస్ స్టౌ లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీసీఈఓ అబ్బి రెడ్డి రమణారెడ్డి, ఎంపీడీఓ కె.స్వప్న, వ్యవసాయాధికారి సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ రాంబాబు, ఏడీఏ పద్మశ్రీ, వైస్ ఎంపీపీ బందిలి విరీష, ఎంపీటీసీ వెంకట్రాజు, పాల్గొన్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తజనం

ఈ మూడు రోజులూ కొనసాగనున్న రద్దీ



సత్యదేవుని దర్శనానికి క్యూలో భక్తులు

అన్నవరం : కార్తిక శుద్ధ ద్వాదశి (క్షీరాబ్ధి ద్వాదశి) సందర్భంగా శుక్ర వారం రత్నగిరి సత్యదేవుని దర్శనానికి వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం ప్రాంగణం, వ్రతమండపాలు, క్యూ లైన్లు ఎక్కడ చూసినా జనసందోహం దర్శనమిచ్చింది. గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున రత్నగిరిపై 50 వివాహాలు జరిగాయి. ఆ నవ దంపతులతో పాటు, ఇతర ప్రాంతాలలో వివాహాలతో ఒక్కటైన దంపతులు వారి బంధుమిత్రులు కూడా సత్యదేవుని దర్శనానికి వచ్చారు. భక్తజనానికి పెళ్లి బృందాలు కూడా తోడవడంతో రత్నగిరిపై తీవ్ర రద్దీ ఏర్పడింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు. సత్యదేవుని వ్రతాలు సుమారు మూడు వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. శని, ఆదివారాలు, కార్తిక పౌర్ణమి, సోమవారం పర్వదినాల సందర్భంగా రత్నగిరికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం అమరావతి నుంచి కలెక్టర్, జేసీలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికా శుక్లా హాజరయ్యారు. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి చేపట్టిన చర్యలను సీఈవోకు కలెక్టర్ వివరించారు. ఫారం 6,7,8, పరిష్కారాలు, ముసాయిదాపై మీడియా కథనాలు, జనాభా, ఓటర్ రేషియో, జెండర్ రేషియో, ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీ, 18–19 సంవత్సరాల మధ్య ఉన్న ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్, మార్పులు, చేర్పులు, తొలగింపు, ఓటు బదలాయింపు వంటి అంశాలపై సీఈవో చర్చించారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుగుణంగా జిల్లాలో ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను చేపడుతున్నామన్నారు. ఇప్పటివరకు నమోదైన ఫారం 6,7,8 దరఖాస్తుల పరిశీలన, పరిష్కారాలు త్వరితగతిన నిర్వహిస్తున్నారు. ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల నుంచి అందిన అభ్యంతరాలను ప్రతి వారం రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు జిల్లాలోని అన్ని ఇంటర్, డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, జిల్లా రెవెన్యూ అధికారి కె శ్రీధర్‌రెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డీటీ ఎం జగన్నాథం, రామ్ కుమార్, సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో క్రీడా సంక్రాంతులు

- గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం
- 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో ప్రత్యేక కార్యక్రమం
- డిసెంబర్ 15న ప్రారంభానికి కసరత్తు
- ఈనెల 27 నుంచి ప్రారంభమైన రిజిస్ట్రేషన్లు
- సచివాలయాల పరిధిలో పోటీల నిర్వహణ
- సచివాలయం పరిధిలో 20 జట్లు ఎంపిక
- 15 ఏళ్ల వయసు దాటిన బాల, బాలికలకు అవకాశం



సాక్షి, రాజమహేంద్రవరం/నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, పోటీ తత్వాన్ని పెంపొందించే దిశగా ప్రణాళికలు రూపొందించింది. క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సంక్రాంతికి నెల రోజుల ముందే ఈ పోటీలు డిసెంబర్ 15వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. వచ్చే ఏడాది జనవరి 26వ తేదీ వరకు నిర్వహిస్తారు. వీటిని ప్రతి సచివాలయ పరిధిలో నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది.

620 సచివాలయాల్లో నిర్వహణ

జిల్లా వ్యాప్తంగా 620 సచివాలయాల్లో క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో పోటీలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్టు, క్రీడాకారులు అనంతరం మండల స్థాయిలో పోటీల్లో పాల్గొంటారు. అనంతరం జిల్లా స్థాయి, అ అక్కడ సత్తా చాటితే రాష్ట్ర స్థాయికి వెళతారు.

పోటీలు జరుగుతాయిలా..

క్రీడా పోటీలు ప్రతి సచివా లయం పరిధిలో నిర్వహిస్తా రు. అందుకు కొన్ని మార్గదర్శకాలు రూపొందించారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ క్రీడా పోటీల్లో ఒక్కో క్రీడకు ఇద్దరు పురుషులు, రెండు మహిళా జట్లు పాల్గొంటాయి. సచివాలయం పరిధిలో పోటీలు నిర్వహించాలంటే 228 క్రీడాకారులు ఉండాలి. అందుకు అనుగుణంగా క్రీడాకారుల ఎంపికకు కసరత్తు జరుగుతోంది. ప్రతి సచివాలయం పరిధిలో 20 జట్లు పాల్గొంటాయి. సచివాలయ పరిధిలో 5 రోజులు, మండల స్థాయిలో 12 రోజులు, నియోజకవర్గ స్థాయిలో 5 రోజుల పాటు పోటీలు జరుగుతాయి. ఏడు రోజుల పాటు జిల్లా, 5 రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో జరుగుతాయి.

27 నుంచి రిజిస్ట్రేషన్లు

క్రీడాకారులకు ఈనెల 27వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. వలంటీర్లు శనివారం నుంచి ప్రతి ఇంటికీ తిరిగి ఆడుదాం ఆంధ్రాపై అవగాహన కల్పిస్తారు. ఆసక్తి ఉన్న క్రీడాకారుల నుంచి వివరాలు సేకరిస్తారు. అనంతరం ఆన్‌లైన్ చేస్తారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

పారదర్శకంగా పోటీలు

గ్రామ సచివాలయ స్థాయిలో నిర్వహించే పోటీలు పక్కాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక కమిటీని నియమించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, స్పెషల్ నోడల్ అధికారి జాయింట్ కలెక్టర్ ఉంటారు. గ్రామ స్థాయిలో గ్రేడ్–5 సెక్రటరీ, వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, పాఠశాల హెచ్‌ఎం కమిటీలో ఉంటారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, పంచాయతీ విస్తరణాధికారి, ఏపీఓ, ఉపాధి హామీ, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వ్యవసాయ శాఖ, ఏఓ, ఇంజినీరింగ్ ఏఈ, సభ్యులుగా ఉంటారు.

15 ఏళ్లు పైబడిన వారు అర్హులు

క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు 15 ఏళ్ల వయసు దాటిన బాల బాలికలకు అవకాశం కల్పించారు. వీరితో పాటు మహిళలు, పురుషులు సైతం పోటీల్లో పాల్గొనే వెసులుబాటు కల్పించారు. ఇందుకు ఈనెల 27వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభంకానుంది. గ్రామ, వార్డు సచివాలయాలకు క్రీడలకు అవసరమైన సామగ్రి పంపిణీ చేయనున్నారు. సచివాలయ స్థాయిలో బేసిక్, నియోజకవర్గ స్థాయిలో ప్రొఫెషనల్ క్రీడా సామగ్రి అందజేయనున్నారు. మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు టీషర్ట్, క్యాప్, రిస్ట్ బ్యాండ్, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్ అందిజేస్తారు. క్రీడల నిర్వహణకు సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల సేవలు వినియోగించుకుంటారు.

పోటీల షెడ్యూల్

గ్రామ స్థాయి	: డిసెంబర్ 15–20వ తేదీ
మండల స్థాయి	: డిసెంబర్ 21–జనవరి 4
నియోజకవర్గ స్థాయి	: జనవరి 5–10
జిల్లా స్థాయి	: జనవరి 11–21
రాష్ట్ర స్థాయి	: జనవరి 22–26

పకడ్బందీ ఏర్పాట్లు



జిల్లాలో ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. పోటీలు డిసెంబరు 15 ప్రారంభం కానున్నాయి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరో మూడురోజుల్లో ప్రారంభం అవుతుంది. వలంటీర్లకు సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా పోటీల నిర్వహణపై శిక్షణ అందిస్తున్నాం. 15 సంవత్సరాలు పైబడిన గ్రామీణ క్రీడాకారులకు ఇదో చక్కని అవకాశం.

శ్రీనివాస్ కుమార్, డీఎస్‌ఏ చీఫ్‌కోచ్

ప్రతిభను వెలికితీయవచ్చు



గ్రామీణ ప్రాంతాల్లో 15 సంవత్సరాలు పైబడిన యువతీ యువకుల్లో ఉన్న క్రీడాప్రతిభను వెలికితీయడానికి నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు దోహదపడతాయి. సుమారు 45 రోజుల పాటు జిల్లాలో క్రీడాపండుగ వాతావరణం నెలకొననుంది.

వి.రవిరాజు,
పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు



జలవిహారం.. జగదానందకరం

- నేత్ర పర్వంగా సత్యదేవుని తెప్పోత్సవం
- పంపా సరోవరంలో హంస వాహనంపై విహరించిన స్వామి, అమ్మవారు
- వేలాదిగా తిలకించిన భక్తజనం

అన్నవరం: నింగిలో మబ్బుల మాటున దోబూచులాడుతున్న చంద్రుని కిరణాల్లో.. పాలకడలిని తలపించిన పంపా సరోవరంలో.. దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారితో కలసి.. భక్తవరదుడు, రత్నగిరివాసుడు అయిన సత్యదేవుని హంస వాహన విహారం అత్యంత వైభవంగా.. పరమానందకరంగా జరిగింది. క్షీరాబ్ది ద్వాదశి (కార్తిక శుద్ధ ద్వాదశి) పర్వదినాన్ని పురస్కరించుకుని.. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల ఘోష.. కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ ఈ వేడుక శుక్రవారం రాత్రి సుమారు రెండు గంటల పాటు అత్యంత వైభవంగా జరిగింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు ఈ సుమనోహర దృశ్యం చూసి పరవశించారు.

ఉత్సవం జరిగిందిలా..

సాయంత్రం 5.30 గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను, క్షేత్రపాలకులు సీతారాములను రత్నగిరి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా పంపా జలాశయం తీరానికి తీసుకువచ్చారు. అక్కడ పూజా మండపంలో ప్రత్యేక సింహాసనంపై సత్యదేవుడు, అమ్మవారిని, పక్కనే మరో ఆసనంపై సీతారాములను ఉంచి పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, తులసీ ధాత్రి పూజ నిర్వహించారు. సత్యదేవుడు, అమ్మవార్లకు వేదాశీస్సులు అందజేశారు. అనంతరం 6.30 గంటలకు సత్యదేవుడు, అమ్మవార్లను మేళతాళాల నడుమ ఊరేగింపుగా పంపా నది ఒడ్డున సర్వాంగ సుందరంగా అలంకరించిన హంస వాహనం మీదకు వేంచేయించారు. తిరిగి పూజలు చేసి, హారతులిచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ హంస వాహనంలో స్వామి, అమ్మవార్లను పండితులు మూడుసార్లు నదిలో విహరింపజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను, సీతారాములను దేవస్థానానికి తిరిగి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. జలాశయం తీరం వెంబడి, ఘాట్ రోడ్డు పొడవునా పెద్ద సంఖ్యలో నిల్చున్న భక్తులు తెప్పోత్సవాన్ని తిలకించి పులకించారు. వారికి ఉత్సవానంతరం ఘాట్ రోడ్డు టోల్ గేటు వద్ద తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తెప్పోత్సవ ఏర్పాట్లను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్ర మోహన్ పర్యవేక్షించారు. ఉత్సవం సందర్భంగా పంపా తీరాన్ని, ఘాట్ రోడ్డును రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి హంస వాహనాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్, అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. వేద పండితులు గొల్లపల్లి ఘనాపాఠి, యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితులు పాలంకి పట్టాభి, అంగర సతీష్, అర్చకులు సుధీర్, దత్తాత్రేయశర్మ, రామ్‌కుమార్ తదితరులు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా రెండు స్పీడ్ బోట్లలో గజ ఈతగాళ్లతో పాటు పంటుకు మరమ్మతులు చేసే సాంకేతిక సిబ్బంది కూడా హంస వాహనాన్ని అనుసరించారు. ముందు జాగ్రత్త చర్యగా తుని నుంచి అగ్నిమాపక శకటాన్ని, సిబ్బందిని పంపా తీరంలో ఉంచారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యాన వంద మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


తెప్పోత్సవానికి తరలివచ్చిన భక్తులు


పంపా సరోవరంలో కన్నుల పండువగా సత్యదేవుని తెప్పోత్సవం


సత్యదేవుడు, అమ్మవార్లకు పూజలు చేస్తున్న పండితులు


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పర్వత, అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్ర మోహన్ తదితరులు

క్లుప్తంగా

కారు, ఆటో ఢీ.. ఐదుగురికి తీవ్రగాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

తాళ్లరేవు: కోరంగి పోలీస్ స్టేషన్‌కు సమీపాన జాతీయ రహదారి–216పై శుక్రవారం ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ నుంచి యానాం వైపు వెళుతున్న కారు.. ఎదురుగా ప్రయాణికులతో వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న యానాంకు చెందిన పెస్సింగి జగ్గారావు, ఆటో డ్రైవర్ సంగాడి వెంకట నరసింహస్వామి, కోరంగి ఫార్మసీ కళాశాల విద్యార్థి పోతనపల్లి మోహిత్, తెనాలి కూచిపూడి గ్రామానికి చెందిన దేవరకొండ రాజేష్ గాయాలయ్యాయి. కారు నడుపుతున్న పెద్దబొడ్డు వెంకటాయపాలెం పాఠశాల హెచ్‌ఎం నడింపల్లి వెంకటరాజు కారులో బెలూన్లు తెరచుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరిని మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మిగిలిన వారి పరిస్థితి నిలకడగా ఉంది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. కోరంగి ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దెబ్బ తిన్న కారు ముందు భాగం

కట్నం వేధింపులు.. ఐదుగురిపై కేసు

కొవ్వూరు: కట్నం వేధింపులకు పాల్పడుతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై శుక్రవారం కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. కుమారదేవం గ్రామానికి చెందిన బత్తి దేవికి, తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు గతంలో వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. అదనపు కట్నం తీసుకురావాలంటూ ఇటీవల భర్త లక్ష్మణ్, అతడి తల్లిదండ్రులు, బావ, ఆడపడుచు తనను శారీరకంగా, మానసికంగాను వేధిస్తున్నారని దేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి


వేద–2023 సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజానగరం: కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు ఇంజినీరింగ్ విద్యార్థులకు సూచించారు. 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ వాక్యూమ్ ఎలక్ట్రానిక్ డివైజెస్ అండ్ అప్లికేషన్స్' అనే అంశంపై గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా వేద–2023 జాతీయ సదస్సు జరుగుతోంది. బెంగళూరు వేద సొసైటీ సహకారంతో జరుగుతున్న ఈ సదస్సులో రాజు శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సదస్సుకు హాజరైన ప్రముఖులు అందించిన విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుంటూ నైపుణ్యాభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూకే, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు, ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ, వేద సదస్సు ద్వారా విజ్ఞానంతో పాటు పరిశ్రమలకు అవసరమైన పరిజ్ఞానం, నైపుణ్యాలపై అవగాహన కల్పించుకోవచ్చని అన్నారు. కళాశాల ఎండీ కె.శశికిరణ్‌వర్మ మాట్లాడుతూ, ఈ వేదిక ద్వారా సెమీకండక్టర్లు, స్వదేశీ తయారీ సంస్థల అభివృద్ధికి ఔత్సాహికులను ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా వేద–2023 సావనీర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఆర్ఎస్ రాజు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.లీలావతి, డాక్టర్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, వేద కన్వీనర్ పి.వెంకట్రావు, కో కన్వీనర్ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

వశిష్ట గోదావరిలో లక్ష్మీనృసింహుని విహారం

సఖినేటిపల్లి: క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి వారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. పల్లిపాలెంలో స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. తొలుత స్వామి, అమ్మవార్లను గరుడ పుష్పక వాహనంపై అర్చకులు కొలువుదీర్చారు. అనంతరం మంగళ వాయిద్యాల ఘోష నడుమ అంతర్వేది ఆలయం నుంచి పల్లిపాలెంలోని పుష్కర రేవు వరకూ అగ్నికుల క్షత్రియులతో కలిసి ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. అక్కడ ముందే సిద్ధం చేసిన పడవలపై గరుడ పుష్పక వాహనంలో స్వామి, అమ్మవార్లను ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు వేదమంత్రాలతో వేంచేయించారు. ప్రత్యేక పూజల అనంతరం బాణసంచా కాల్పుల నడుమ పుష్కర రేవు నుంచి గొంది సరిహద్దు వరకూ గోదావరి తరగలపై స్వామివారి తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను తిరిగి పుష్కర రేవుకు తీసుకుని వచ్చి, ఆలయానికి చేర్చారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ ఆర్.గోవిందరాజులు, ఎస్సై ఎస్.రాము, సర్పంచ్ ఒడుగు శ్రీను, ఎంపీటీసీ సభ్యులు బైర నాగరాజు, పోతాబత్తుల భాస్కరరావు, మాజీ సర్పంచ్ వనమాలి మూలాస్వామి తదితరులు పాల్గొన్నారు.


తెప్పపై కొలువుదీరిన స్వామివారు

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ: సికింద్రాబాద్ – భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు జనరల్ బోగీ నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి (35) మృతి చెందాడు. రాజమహేంద్రవరం జీఆర్‌పీ ఎస్సై మావుళ్లు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు తెలుపు నీలం రంగు గళ్ల చొక్కా, నలుపు రంగు కాటన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలకు 94910 03239, 0883 – 2442821 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై సూచించారు.

28 నుంచి సమ్మేటివ్–1

- 1 – 10 తరగతులకు ఎస్‌సీఈఆర్‌టీ ప్రశ్నపత్రాలు
- మండల కేంద్రాలకు పరీక్ష పేపర్ల సరఫరా పూర్తి


పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

రాయవరం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసేందుకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ) పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) తాజాగా ప్రకటించింది. దీని ప్రకారం ఈ నెల 28 నుంచి వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకూ 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఎస్‌ఏ–1 పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ప్రశ్నపత్రాలు సరఫరా చేశారు. ఈసారి టోఫెల్ పరీక్షలకు కూడా ప్రింటెడ్ ప్రశ్నపత్రాలు సరఫరా చేయడం గమనార్హం. 1 నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు బైలింగ్విష్ విధానంలో, పదో తరగతి వారికి మీడియం వారీగా ప్రశ్నపత్రాలు అందజేస్తారు. ఎస్‌ఏ–1 పరీక్షలకు విద్యా శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ప్రశ్నపత్రాలపై ప్రతి జిల్లాకు సీక్రెట్ క్యూఆర్ కోడ్ కేటాయించారు. పేపర్లను ఎవరైనా లీక్ చేసినా, ఏ పాఠశాల నుంచి లీక్ అయినా విషయం క్షణాల్లో బయట పడే అవకాశం ఉండేలా చర్యలు చేపట్టారు.

రెండు ఫార్మేటివ్ పరీక్షలు పూర్తి

ఫార్మేటివ్ అసెస్‌మెంట్–1, 2 పరీక్షలు ఇప్పటికే పూర్తయ్యాయి. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది పరీక్ష పేపర్ల మూల్యాంకనం, పరీక్ష పేపర్లను విద్యార్థులకు ఇచ్చి, వారి తల్లిదండ్రుల సంతకాలు తీసుకునేందుకు, మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు షెడ్యూల్ ఇవ్వడం గమనార్హం. జనవరిలో ఫార్మేటివ్–3, మార్చిలో ఫార్మేటివ్–4, ఏప్రిల్‌లో 1 నుంచి 9 తరగతులకు ఎస్‌ఏ–2, మార్చిలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు.

ఇదీ పరీక్షల టైం టేబుల్

- 1–5 తరగతులకు ఈ నెల 28న తెలుగు, డిసెంబర్ 1న ఇంగ్లిష్, 2న గణితం, 4న పరిసరాల విజ్ఞానం, 5న ఇంగ్లిష్ పార్ట్–బి టోఫెల్ పరీక్ష.
- 6–10 తరగతులకు ఈ నెల 28న తెలుగు, డిసెంబర్ 1న హిందీ, 2న ఇంగ్లిష్, 4న గణితం.
- డిసెంబర్ 5న 6–7 తరగతులకు జనరల్ సైన్స్, 8–10 తరగతులకు పీఎస్.
- డిసెంబర్ 6న 8–10 తరగతులకు బీఎస్, 7న సోషల్ స్టడీస్, 8న ఇంగ్లిష్ పార్ట్–బి టోఫెల్ పరీక్ష.
- 1–5 తరగతులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్షలు.
- 6, 8, 10 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ.. 7, 9 తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి.
- 1–8 తరగతులకు 80 మార్కులకు, 9, 10 తరగతులకు 100 మార్కులకు ప్రశ్నపత్రం ఇస్తారు.

తొలిసారి టోఫెల్ ప్రింటెడ్ పేపర్లు

ఇంగ్లిష్‌లో విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించేందుకు ప్రభుత్వం టోఫెల్ విద్యను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు టోఫెల్ పరీక్షను ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు పాఠశాలల్లో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించగా, తొలిసారి ప్రింటెడ్ పేపర్లను ఎస్‌సీఈఆర్‌టీ సరఫరా చేసింది. సాధారణ పరీక్షల మాదిరిగానే ఇకపై టోఫెల్ పరీక్షను ప్రింటెడ్ పేపర్లలో విద్యార్థులు రాయనున్నారు.

2.02 లక్షల మంది విద్యార్థులు

ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు ఎస్‌ఏ–1 పరీక్షలు నిర్వహిస్తారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1–5 తరగతుల వరకు 42,014 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 56,313 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, 6–10 తరగతుల వరకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 66,719 మంది, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో 37,480 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లా మొత్తం మీద 1,580 ప్రభుత్వ యాజమాన్య, 456 ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో 2,02,532 మంది విద్యార్థులు ఎస్‌ఏ–1 పరీక్షలు రాయనున్నారు.

మండల కేంద్రాలకు పేపర్ల పంపిణీ

జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) ద్వారానే ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో ఎస్‌ఏ–1 పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పరీక్ష పేపర్లను డీసీఈబీ ద్వారా మండల విద్యా కేంద్రాలకు చేరవేశారు. వీటికి సంబంధిత ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు. పది పబ్లిక్ పరీక్ష పేపర్ల మాదిరిగానే పరీక్షల తేదీల వారీగా ప్రశ్న పత్రాలను ట్రంకు బాక్సుల్లో భద్రపర్చారు.


కన్నుల పండువగా వేంకటేశ్వరుని తెప్పోత్సవం


గోదావరిపై సాగుతున్న స్వామివారి హంసవాహనం

ఆత్రేయపురం: క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారు శుక్రవారం సాయంత్రం ఉభయ దేవేరులతో కలిసి గౌతమీ గోదావరి జలాల్లో హంసవాహనంపై విహరించారు. ప్రత్యేకంగా అలంకరించిన హంసవాహనంపై స్వామి వారి తెప్పోత్సవం ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. ఉదయం తీర్థపు బిందెతో గోదావరి జలాలు తీసుకుని వచ్చి, సుప్రభాత సేవ అనంతరం, స్వామి వారికి అభిషేకాలు, గోత్ర నామాలతో పూజలు, నిత్య హోమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా గౌతమీ గోదావరికి తీరానికి తీసుకుని వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం స్వామివారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తదితరులు పర్యవేక్షించారు. ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి, ఆత్రేయపురం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాలను కూడా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

ఇరిగేషన్ ఏఈఈ ఆత్మహత్య


మృతుడు అప్పల రాజారెడ్డి (పాత చిత్రం)

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీకి చెందిన వల్లింకల అప్పల రాజారెడ్డి (39) తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయం ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. ఆర్టీసీ కాలనీ రోడ్డు నంబర్–1లో ఉంటున్న అప్పల రాజారెడ్డి గురువారం మధ్యాహ్నం తన గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకున్నాడు. మృతుడు ఆలమూరు మండలంలో ఇరిగేషన్ ఏఈఈగా పని చేస్తున్నాడు. భార్య సుధారాణి కాకినాడలో ఐసీఐసీఐ బ్యాంకులో అసిస్టెంట్ హోదాలో పని చేస్తున్నారు. వీరికి వివాహమై సుమారు 11 ఏళ్లు అవుతోంది. పిల్లలు లేకపోవడంతో సుమారు నాలుగేళ్ల పాపను దత్తత తీసుకుని, పెంచుకుంటున్నారు. అప్పల రాజారెడ్డి ఉరికి వేలాడటం చూసి, భయపడిన ఆ పాప ఏడవడాన్ని సమీపంలోనే ఉంటున్న అతడి తండ్రి సత్యనారాయణ అక్కడకు చేరుకున్నారు. పరిస్థితి గమనించి, బ్యాంక్‌లో విధుల్లో ఉన్న అప్పల రాజారెడ్డి భార్య సుధారాణికి సమాచారం అందించారు. అందరూ కలసి అప్పల రాజారెడ్డిని కిందకు దించి, సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకుని వెళ్లగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సర్పవరం ఏఎస్సై నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. కొడుకు మృతిపై తండ్రి అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సెల్ ఫోన్ లాక్ ఓపెన్ అవలేదని, అది ఓపెన్ అయితే అప్పల రాజారెడ్డి మృతికి కారణాలు తెలిసే అవకాశం ఉంటుందని సీఐ మురళీకృష్ణ చెప్పారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.